Truth of News

RNI NO : APTEL/25/A0239


# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 243 | సోమవారం 23 ఫిబ్రవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



IRS PUBLICATIONS

irspublications12@gmail.com


# డిజిటల్ మోసాల బారిన పడొద్దు

- బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్స్ తరుచూ మార్చండి
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం



బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్‌లను తరుచూ మారుస్తుం డాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ సూచించారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ)ని అప్‌డేట్ చేయమని, రీ-కేవైసీని చేయమని బ్యాంకు నుంచి వచ్చే రిక్వెస్టులను చూసి అస్సలు చిరాకు పడవద్దని ప్రజలను ఆయన కోరారు. సొంత డబ్బును కాపాడుకునేందుకే ఈ పనిని చేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకో వాలన్నారు. ఆదివారం 131వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోడీ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికీ బ్యాంకు ఖాతా కేవైసీని చేశాం కదా, దీన్ని మళ్లీ మళ్లీ ఎందుకు చేయాలనే ప్రశ్న చ

- మిగతా 2లో..

# దేశంలోనే తొలి హైస్పీడ్ మెట్రో

## - యూపీ మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోడీ

మీరట్ - సూర్య వాస్తవం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మెట్రో, నమో భారత్ రైళ్లను ప్రధాని మోడీ జెండా ఊపి ప్రారంభించారు. దేశంలో తొలిసారి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రారంభమైన మెట్రో సర్వీసు ఇది. హైస్పీడ్ ఇంటర్‌సిటీ ప్రయాణానికి ఇది కీలకం కానుంది. ఈ సందర్భంగా 82 కిలోమీటర్ల ఢిల్లీ మీరట్ నమో భారత్ కారిడార్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. భారత్‌లోని తొలి నమో భారత్ ప్రాంతీయ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ సెక్షన్‌లను ప్రారంభించారు. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో

- మిగతా 2లో..





# పోస్టల్ సేవలు వెలకట్టలేనివి

- గుంటూరులో గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళనంలో సిఎం
- ఉద్యోగులకు త్వరలో ఎలక్ట్రిక్ స్కూటర్లు
- కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

గుంటూరు - సూర్య వాస్తవం

తపాలా ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని, దేశంలో సాంకేతికత పెరిగినా వారి సేవలు కొనసాగుతున్నాయని, వీరిలో ఉన్న మానవత్వం వల్ల ఇప్పటికీ తగిన గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరులో ఆదివారం డాక్ సేవక్ రాష్ట్ర సమ్మేళన్

- మిగతా 2లో..

# చంద్రబాబు, జగన్ వ్యాఖ్యలు అర్థరహితం

## - ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

- సీఎం చంద్రబాబు
- గ్రామీణ కనెక్టివిటీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం
- 5 లక్షల ఇళ్లకు ఫైబర్ కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యంగా అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్
- గత ప్రభుత్వం ఫైబర్ నెట్ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని చంద్రబాబు విమర్శ
- టెక్నాలజీ ప్రయోగాలకు ఏపీని టెస్ట్ బెడ్‌గా మారుస్తామన్న ముఖ్యమంత్రి

అమరావతి - సూర్య వాస్తవం



రానున్న ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. టెక్నాలజీ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలంటే డిజిటల్ కనెక్టివిటీ అత్యంత కీలకమని ఆయన అన్నారు. భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో కీలక సహకార ఒప్పందం (వీశీజ) కుదిరింది. సీఎం చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. డిజిటల్ భారత్ నిధి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఈ ఒప్పందంపై డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ఐటీ,

- మిగతా 2లో..

# గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

- దేవాదుల భూసేకరణకు రూ.600 కోట్లు
- మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను గాలికొదలం
- రాష్ట్రంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం
- చాలా గొప్పగా మేడారం నిర్వహణ

: సీఎం రేవంత్‌రెడ్డి

ములుగు - సూర్య వాస్తవం



దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకం`ణకు రూ.600 కోట్లను కేటాయించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్దనున్న దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్‌ను సీఎం సందర్శించారు. అనంతరం ప్రాజెక్టు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసేకరణ జాప్యంతో ప్రాజెక్టులు ఆపడానికి వీలులేదన్నారు. అన్ని ప్రాజెక్టుల భూసేకరణకు ప్రత్యేక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి అన్ని అంచనాలను ప్రభుత్వం ముందుకు బడ్జెట్ సమావేశాలకు ముందే తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. మార్చిలో మంత్రివర్గ సమావేశంలో అన్ని అంచనాలకు ఆమోదం తెలుపనున్నట్టు స్పష్టం చేశారు. నెలలోపు దేవాదుల పంపుల మరమ్మతులను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. రామప్ప చెరువు నుంచి జంపన్నవాగుకు నీరందించే ప్రణాళికపై వెంటనే నివేదికను సమర్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండేండ్లలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికే ఇక్కడికి వచ్చినట్టు చెప్పారు. గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ బడ్జెట్ సమావేశాల అనంతరం గోదావరి జలాలపై ముఖాముఖి చర్చ పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు సీఎం తెలిపారు. ఈ వివాదాలపై

- మిగతా 8లో..



# లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు

- లడ్డూ వివాదంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసీపీ ఆరోపణ
- ఏకసభ్య కమిటీ వేయడం సుప్రీంకోర్టును అవమానించడమేనన్న భూమన
- తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీ అని విమర్శ

తిరుపతి- సూర్య వాస్తవం

తిరుపతి లడ్డూ వివాదంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని, దారి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని వైసీపీ విమర్శించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలను, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అవకతవకలను ఎండగట్టడంలో వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఆదివారం నాడు వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూ అంశంపై ఏకసభ్య కమిటీని నియమించడం సుప్రీంకోర్టును అవమానించడమేనని

- మిగతా 2లో..



# పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసింది జగనే

- గతంలో జగన్ తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టిన లోకేశ్
- కపట ప్రేమతో ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ తీవ్ర విమర్శ

2లో

# డిజిటల్ మోసాల బారిన పడొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని అన్నారు. 'మళ్లీమళ్లీ కేవైసీ ఎందుకంటే, బ్యాంకు ఖాతా భద్రత కోసమే' అని అందరూ గ్రహించాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్టు లాంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బారినపడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కాలంలో పెన్షన్, రాయితీలు, బీమా, యూపీఐ సహా అన్నీ బ్యాంకు ఖాతాతోనే లింకై ఉన్నాయని మోడీ గుర్తుచేశారు. అందుకే ఖాతాలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు రీ కేవైసీని బ్యాంకులు చేయిస్తాయన్నారు.

# దేశంలోనే తొలి హైస్పీడ్ మెట్రో

(మొదటిపేజీ తరువాయి)

నమో భారత్ భారత తొలి ప్రాంతీయ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ. అలాగే రూ.12,930 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైళ్లను ప్రారంభించిన తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ప్రధాని మోడీ.. మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో విద్యార్థులు, అధికారులతో ముచ్చటిస్తూ ప్రయాణించారు. అనంతరం మోడీ మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించిన ప్రపంచస్థాయి ఏఐ సదస్సును కాంగ్రెస్ పార్టీ మురికి, సిగ్గులేని రాజకీయాలకు వేదికగా మార్చిందని విమర్శించారు.

# పోస్టల్ సేవలు వెలకట్టలేనివి

(మొదటిపేజీ తరువాయి)

(పోస్టుమాస్టర్స్) జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి గ్రామీణ పోస్టు మాస్టర్లు హాజరయ్యారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి సిఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గన్నారు. ఉత్తమ డాక్ సేవక్‌లను అవార్డులతో సత్కరించారు. వీరికి ప్రత్యేకంగా రూపొందించిన డ్రస్ కోడ్, బ్యాగ్, టోపీ, ఇతర కానుకలతో ఉద్యోగులను జ్యోతిరాదిత్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. తపాలా సేవలకు 150 ఏళ్ల చరిత్ర ఉందని, ఇప్పటికీ గ్రామాల్లో వీరి సేవలు కొనసాగడం ముదావాహమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. ఎంత టెక్నాలజీ వచ్చినా మానవత్వంతో పని చేసేది డాక్ సేవకులేనని, డాక్ సేవకులు లేకపోతే గ్రామీణ ప్రాంతంలో లాజిస్టిక్ వ్యవస్థ ఉండదన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ పథకాలకు వీరి సేవలను వినియోగించుకుంటామని చెప్పారు. మెషిన్లు, ఏఐ ద్వారా ఏ పనైనా జరుగుతుంది కానీ మనిషి ఇచ్చే హ్యూమన్ టచ్ డాక్ సేవకులు మాత్రమే ఇవ్వగలరని కొనియాడారు. బాగా చదువుకున్నవాళ్లు గ్రామాల్లో ఉండి ప్రజలకు సేవ చేసేందుకు పోస్టల్ జాబ్ చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ డాక్ సేవక్‌లకు త్వరలో ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇవ్వనున్నట్టు జ్యోతిరాదిత్య తెలిపారు. ప్రధానంగా గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులకు కనీస మౌలిక సదుపాయాలు లేవని గుర్తించి, తాను కేంద్ర ఆర్థిక మంత్రికి నిధుల కోసం ప్రతిపాదనలు ఇచ్చానని తెలిపారు. గ్రామీణ డాక్ సేవక్‌ల పిల్లలకు కేంద్రీయ విద్యాలయాలల్లో సీట్లు ఇప్పిస్తున్నామని, తపాలా వ్యవస్థపై ప్రజలల్లో ఇంకా విశ్వాసం ఉందని తెలిపారు. ఎన్ని ఉపద్రవాలు వచ్చినా గ్రామీణ డాక్ సేవక్‌లు తగ్గేదేలే అన్నట్టుగా పనిచేస్తున్నారని పుష్ప సినిమా డైలాగులను ఆయన ప్రస్తావించారు. గుంటూరు నుంచి మిర్చి ఇతర దేశాలకు, రాష్ట్రాలకు చేరవేయడంలో పోస్టల్ శాఖ కూడా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పార్శిల్, మెయిల్ నెట్ వర్క్‌లో వేగం పెరగాలన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తపాలా సేవలకు కేంద్రం రూ.35 కోట్లు ఖర్చుపెడుతుంటే రూ.13 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తపాలా శాఖను లాభాల్లోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సభలో పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు సురేంద్రకుమార్, శ్రీదేవి, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, స్థానిక ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ తదితరులు పాల్గన్నారు.

# లడ్డూ వ్యవహారంలో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. "లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతు కొవ్వు లేదని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే సీబీఐ సిట్ బృందం స్పష్టంగా నివేదిక ఇచ్చింది. ఇప్పుడు ఆ నివేదికను ప్రశ్నించేలా కమిటీ వేయడం సర్వోన్నత న్యాయస్థానం గౌరవాన్ని సవాలు చేయడమే" అని ఆయన పేర్కొన్నారు. లడ్డూపై చంద్రబాబు, ఆయన అనుకూల మీడియా చేసిన తప్పుడు ప్రచారాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేశారని భూమన ఆరోపించారు. సిట్ నివేదికతో వారి వాదనలు తప్పని తేలడంతో, ముఖం చాటేసేందుకే ఈ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కమిటీ చట్టపరంగా నిలబడదని ఆయన అభిప్రాయపడ్డారు. "ఈ కుంభకోణానికి మూలమైన హెరిటేజ్, ఇందాపూర్, భోలే బాబా డెయిరీల మధ్య ఉన్న సంబంధాలను మేం బయటపెడుతూనే ఉంటాం" అని కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు, పరకామణి చోరీ కేసులో కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి, రాజకీయ ప్రత్యర్థులను ఇరికించేందుకు టీటీడీ ప్రయత్నిస్తోందని, ఇది కూడా ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలో భాగమేనని ఆయన ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలకు భయపడబోమని, న్యాయపోరాటం చేస్తామని భూమన తేల్చి చెప్పారు.

# చంద్రబాబు, జగన్ వ్యాఖ్యలు అర్థరహితం

### - ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

**అమరావతి - సూర్య వాస్తవం**

బాధ్యత గురించి చంద్రబాబు, రాజకీయ ఐక్యత గురించి జగన్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. అస్తవ్యస్త సదస్సుతో 70 దేశాల ముందు దేశ ప్రతిష్టను దిగజార్చితే సిగ్గుపడాలని ఎందుకు అనిపించలేదని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దేశ రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి, ట్రంప్ ఎదుట సాగిలపడ్డప్పుడే దేశ పరువు పోయిందన్నారు. అమెరికా ప్రయోజనం కోసం సున్నా సుంకాలకు ఒప్పుకున్నప్పుడే దేశ ప్రతిష్ట దిగజారిందని తెలిపారు. అగ్రరాజ్యంతో జరిగింది బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమని చెప్పే ప్రయత్నమే యువజన కాంగ్రెస్ చేసిందన్నారు. చంద్రబాబు, జగన్‌కు ఇది అర్థం కాకపోవడం వారి అవివేకమన్నారు.

# ఏడాదిన్నరలో ప్రతి ఇంటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సంతకాలు చేశారు.

**భారత్ నెట్ ప్రాజెక్ట్‌తో డిజిటల్ విప్లవం**

రాష్ట్రంలో సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు ఫైబర్ కనెక్షన్లు అందించే లక్ష్యంతో 'అమెండెడ్ భారత్ నెట్ ప్రాజెక్ట్-ఏబీఎన్‌పీ'ని అమలు చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్లు కేటాయించడానికి అంగీకరించింది. ప్రాజెక్ట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్' (ఆప్రాదీ×రా) పేరుతో ప్రత్యేక యంత్రాంగాన్ని (శ్రాఎ) ఏర్పాటు చేసింది. డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిధులు సమకూర్చి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లను న్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా ఫేజ్-× కింద ఉన్న 1,692 పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయడం, ఫేజ్-××లోని 11,254 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పూర్తి చేయడం, కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**గత ప్రభుత్వం ఫైబర్ నెట్‌ను నాశనం చేసింది: సీఎం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "2014-19 మధ్య కాలంలో విద్యుత్ స్తంభాల ద్వారా ఫైబర్ కేబుల్స్ వేసి 9.78 లక్షల ఇళ్లకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చాం. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం దురుద్దేశంతో ఆ వ్యవస్థను పూర్తిగా నాశనం చేసింది. దాని ఫలితంగా కనెక్షన్ల సంఖ్య 3.80 లక్షలకు పడిపోయింది. ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో డిజిటల్ కనెక్టివిటీని ప్రతి ఇంటికీ అందిస్తాం" అని ఆయన వివరించారు. తాను తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తున్నానని, టెలికాం రంగంలో సంస్కరణల కోసం నాటి ప్రధాని వాజ్‌పేయిని కోరిన విషయాన్ని గుర్తుచేశారు.

**టెక్నాలజీతో సుపరిపాలన, ఏపీకి ఉజ్వల భవిష్యత్తు**

"ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో దేశంలో డిజిటల్ విప్లవం అద్భుతంగా సాగుతోంది. గ్లోబల్ నాలెడ్జ్‌ను గ్రామాలకు చేర్చాలంటే బ్యాండ్ విడ్త్ పెరగాలి. దానికి కేంద్రం సహకరిస్తుండటం శుభపరిణామం" అని చంద్రబాబు అన్నారు. టెక్నాలజీతో పాలనను సులభతరం చేస్తున్నామని, వాట్సాప్ ద్వారా 900కు పైగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూ రికార్డులకు భద్రత కల్పిస్తున్నామని, సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తేబోతున్నామని చెప్పారు. "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయనే భయం వద్దు. ఏఐ ద్వారా కొత్త ఉద్యోగాలు సృష్టించేలా యువతలో నైపుణ్యాలు పెంచుతున్నాం. వన్ ఫ్యామిలీ-వన్ ఏఐ ఎక్స్‌పర్ట్ అనే విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టి కన్సార్షియంతో దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను రాష్ట్రానికి తెస్తున్నాం. రానున్న రెండేళ్లలో అమరావతి నుంచే క్వాంటం కంప్యూటర్లు ఉత్పత్తి చేయాలనేది మా ఆలోచన. టెక్నాలజీ, టెలికాం రంగంలో ఎలాంటి ప్రయోగాలు చేయాలన్నా ఆంధ్రప్రదేశ్ ఒక టెస్ట్ బెడ్‌గా సిద్ధంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫైబర్ నెట్ ఎండీ గీతాంజలి శర్మ, బీఎస్ఎన్ఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలపై చర్చకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని, మా తప్పులు ఏంటో, మీ తప్పులు ఏంటో చర్చిద్దామని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి అన్నారు. మీది పదేండ్ల అనుభవమని, మాది రెండేండ్ల అనుభవమని, ఎవరేం చేశారో పూర్తిస్థాయి చర్చ చేద్దామని చెప్పారు. ఆరోపణలు చేస్తే అతికేట్టు ఉండాలని, చవకబారు ఆరోపణలు, విమర్శలు చేయొద్దని కేసీఆర్, హరీశ్‌రావుకు సీఎం సూచించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన సూచనలను రాసుకున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. ఇప్పటికీ మాకు ఓటు వేయకపోవడం ప్రజలదే తప్పు అనే భావనలో ఉండటం సరైంది కాదని హితవు పలికారు. మీ తప్పులను సమీక్షించుకోండని సలహానిచ్చారు. సహేతుకమైన విమర్శలు చేయాలన్నారు. ప్రజలు విజ్ఞులు, ప్రజలను తప్పుపట్టడం మానండని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. పిల్లి శాపనార్థాలు పెడితే ఉట్టిపడదన్నారు.

కృష్ణా జలాలపై ఎన్నో అపోహలుండేవని, ఈ నేపథ్యంలోనే అసెంబ్లీలో పూర్తిస్థాయి చర్చ పెట్టడం జరిగిందన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు.. నీటిపారుదల శాఖ మంత్రులుగా ఉన్నప్పుడు ఏం జరిగింది.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా ఉన్న ఈ రెండేండ్లలో ఏం జరిగిందనేది స్పష్టంగా చర్చ జరిగిందని చెప్పారు. వాళ్ల ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పామన్నారు. మీరు తప్పు చేశారనే ప్రజలు గుర్తించి శిక్షించారని తెలిపారు. గోదావరి జలాలపై అబద్ధాలను ప్రచారం చేయడం మానుకోవాలని కోరారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేసి ఇతర ప్రాజెక్టులను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులుండేవని, ఆ పదేండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని తెలిపారు. రాష్ట్రంలో రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారముందన్నారు. 2001లో దేవాదుల ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.6 వేల కోట్లు అని, అనంతరం అంచనాలు రూ.13,400 కోట్లకు, రూ.14,500 కోట్లకు పెరిగాయని, తాజాగా రూ.18,500 కోట్లకు అంచనాలు ఎగబాకాయని చెప్పారు. ఇకనైనా ఈ అంచనాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. ఈ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. గోదావరిపైనున్న తుమ్మిడిహట్టి నుంచి భద్రాచలం వరకు ఎన్ని ప్రాజెక్టులుంటే అన్ని ప్రాజెక్టుల పనులనూ సమీక్షించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క నీటిబొట్టును లిఫ్టు చేయకపోయినా దేశంలో గత రెండేండ్లలో వరిని అత్యధికంగా పండించడంలో, ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రమే నెంబర్ వన్‌గా ఉండేది కాదన్నారు.

**మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను గాలికొదిలేయం..**

వేల కోట్ల రూపాయలతో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను గాలికొదిలేయ బోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బ్యారేజీ నిర్మాణల్లో ఉన్న లోపాలను సరిదిద్ది భవిష్యత్తులో ప్రమాదాలు లేకుండా చేయడానికే సమయం పడుతుందన్నారు.

**మరోమారు మేడారానికి..**

మేడారం జాతరలో చిన్నచిన్న తప్పులున్నా చాలా గొప్పగా నిర్వహించినందుకు అధికారులను, మీడియాను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. బడ్జెట్ సమావేశాల అనంతరం మేడారంలో మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిద్దామన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, తెల్లం వెంకట్రావు, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్‌జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞాన చీకటిలో.. విజ్ఞాన జ్యోతిని వెలిగించిన డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్

### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ

**అనంతపురం - సూర్య వాస్తవం :**



దేశంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యానంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. 11 సంవత్సరాల పాటు భారత విద్యాశాఖ మంత్రిగా పనిచేసి, ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని మౌలానా పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, గ్రామస్థాయి వరకు విద్యావ్యవస్థను తీసుకెళ్లారని పేర్కొన్నారు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించారు. ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్లు జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం తొలి విద్యామంత్రిగా పదకొండేళ్లపాటు విశిష్ట సేవలందించారని తెలిపారు.

# పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసింది జగనే

### - గతంలో జగన్ తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టిన లోకేశ్
### - కపట ప్రేమతో ఇప్పుడు నీతులు చెబుతున్నారంటూ తీవ్ర విమర్శ

**అమరావతి- సూర్య వాస్తవం**

ఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ నిరసనపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. పెట్టుబడుల వాతావరణాన్ని దెబ్బతీసిన జగన్ ఇప్పుడు దేశ ప్రతిష్ఠ గురించి మాట్లాడటం కపట ప్రేమను ప్రదర్శించడమేనని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పోస్టు పెట్టారు. ఢిల్లీ ఏఐ సదస్సులో జరిగిన నిరసన దేశానికి తలవంపులు తెచ్చిందని, రాజకీయ విభేధాలున్నా ప్రపంచ వేదికపై దేశ గౌరవాన్ని కించపరచవద్దని జగన్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన లోకేశ్, జగన్ గతాన్ని గుర్తు చేస్తూ పలు ఆరోపణలు చేశారు. 'భారత్‌లో పెట్టుబడుల వాతావరణానికి అందరికంటే ఎక్కువ నష్టం కలిగించిన వ్యక్తి, ఇప్పుడు నకిలీ సానుభూతి ప్రదర్శిస్తున్నారు. ఈ కపటత్వం ఆశ్చర్యం కలిగిస్తోంది' అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ గతంలో తీసుకున్న పలు నిర్ణయాలను లోకేశ్ ఏకరువు పెట్టారు. 2017లో ఇన్వెస్ట్‌మెంట్ సదస్సును అడ్డుకునేందుకు విమానాశ్రయంలో ధర్నా చేశారు. 2019లో అంతర్జాతీయ పెట్టుబడిదారులతో కుదిరిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారు. 2020లో అమరావతిలో సింగపూర్ ప్రభుత్వం పెట్టాల్సిన పెట్టుబడులను అడ్డుకున్నారు. 2025లో ప్రభుత్వ నిధుల సమీకరణను నిలిపివేయాలని ఆర్‌బీఐకి లేఖ రాశారు. ఇప్పుడు 2026లో ఏఐ సదస్సు ఘటనపై ఆందోళన చెందుతున్నట్టు నటిస్తున్నారని లోకేశ్ విమర్శించారు.

## ఇంటర్ పరీక్షలకు
# 'పోలీస్' పహారా

- పకడ్బందీగా ఏర్పాట్లు - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- జిరాక్స్ సెంటర్లు మూసివేయాల్సిందే - నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- ఎలక్ట్రానిక్ పరికరాలపై నిషేధం - విద్యార్థులకు ఎస్పీ ఆల్ ది బెస్ట్



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం**

అన్నమయ్య జిల్లాలో నేటి నుండి ప్రారంభం తిరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు, లిజిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనవ్వకుండా ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆయన పిలుపునిచ్చారు. పరీక్షల నిర్వహణపై ఎస్పీ జారీ చేసిన కీలక ఆదేశాలు..

**కట్టుదిట్టమైన బందోబస్తు – 144 సెక్షన్:**

జిల్లావ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రజలు గుంపులుగా చేరడం నిషిద్ధం. జిరాక్స్ షాపుల మూసివేత:లి పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాలకు సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలి. ఈ నిబంధనను అతిక్రమించే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడమైనది.

**నిఘా నీడలో కేంద్రాలు**

ప్రతి పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యాసంస్థలకు సూచించాం. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ వంటి చర్యలకు పాల్పడే వారిపై, వారికి సహకరించే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

విద్యార్థులకు ముఖ్య సూచనలు:లి పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు, బ్లూటూత్, ఇయర్ బడ్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోము. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చాం. పరీక్షా కేంద్రాల బయట నిలబడి విద్యార్థులకు జవాబులు చెప్పడం లేదా సంజ్ఞలు చేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదు. . విద్యార్థులకు ఆల్ ది బెస్ట్: "పరీక్షలు మీ భవిష్యత్తుకు బంగారు బాటలు. క్రమశిక్షణతో, స్వయంకృషితో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు". పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖకు ప్రజలు, విద్యాసంస్థలు సహకరించాలని ఎస్పీ కోరారు.

# జనసేన సభ్యత్వ నమోదు శుభారంభం

- 26 నుంచి క్రియాశీలక సభ్యత్వాల నమోదు
- అట్ల కృష్ణారావు పిలుపు



**నాయుడుపేట – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు అట్ల కృష్ణారావు పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఈ నెల 15న మంగళగిరిలో జనసేన ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26వ తేదీ నుంచి సభ్యత్వాల నమోదు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలో 26వ తేదీ నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించనున్నట్లు అట్ల కృష్ణారావు వెల్లడించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి జనసైనికుడు, ప్రతి వీర మహిళ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని అధిక సంఖ్యలో క్రియాశీలక సభ్యులను పార్టీలో చేర్చాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 400 రూపాయలు చెల్లించి క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి పార్టీలో గుర్తింపుతో పాటు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ అడుగుజాడల్లో నడవాలని ఆశించే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయుడుపేట మండల అధ్యక్షుడు గిండి సతీష్, ఉపాధ్యక్షుడు మధు, టౌన్ నాయకులు బాలు శెట్టి, యాసిన్, జానకిరామ్, మునీంద్ర, సుమతి రావు, సోము, ఉదయ్, జ్యోతిష్ తదితరులు, వీర మహిళలు రోహిణి, హేమ, సల్మా, వైష్ణవి పాల్గొన్నారు.

# ఆగని అవినీతి..?



- ఆఫీస్ సూపరిండెంట్ వ్యవహారం వివాదాస్పదం
- డియంహెచ్‌వో కార్యాలయంలో పనిచేసే క్రమంలోలోనే పదుల సంఖ్యలో ఆరోపణల వెల్లువ
- ప్రిన్సిపాల్, ఎడిను తప్పుదారి పట్టించే ప్రయత్నం
- అలవాటు ప్రకారం చేతివాటం ప్రదర్శించేందుకు ప్రత్యేక పద్ధతి

**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :**

జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో కొనసాగుతున్న నియామకాల వివాదం మరింత ముదురుతోంది. ఇప్పటికే పాత రోస్టర్ లో లోపాలు, ప్రస్తుత నోటిఫికేషన్ లో స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేయకుండానే కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, కళాశాల ఆఫీస్ సూపరిండెంట్ అతావుల్లా వ్యవహారం కొత్త చర్చకు దారి తీసింది...."ఎవరెవరు గొడవపడితే మనకెందుకు, మన పని మనం చేసుకుందాం" అనే వింత ధోరణితో కౌన్సిలింగ్ ప్రక్రియలో ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రిన్సిపాల్‌కు తప్పుడు సలహాలు ఇస్తూ తప్పుదారి పట్టించి అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఈ అధికారి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పనిచేసిన సమయంలోనే అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారని, అయితే ఆ ఆరోపణలపై సమగ్ర విచారణ జరగలేదని సమాచారం. "విచారణ చేయలేము"అంటూ అధికారులు చేతులు ఎత్తేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపణదారులు పేర్కొంటున్నారు. విచారణ అధికారిగా తొలగించండి అని స్వయం గా విచారణ అధికారి ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఆధారాలు లభ్యం.

**చేతి వాటం ప్రక్రియ**

కౌన్సిలింగ్ ప్రక్రియలో ఆయన అనుసరిస్తున్న పద్ధతి పై పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫైనల్ లిస్ట్ ప్రకారం రోస్టర్ పాయింట్లు ముందుగానే తెలుసుకుని, సెలెక్ట్ అయ్యే అవకాశమున్న అభ్యర్థులను సంప్రదించి 'ఎర' వేయడం జరుగుతోందని ఆరోపణలు ఉన్నాయి. ఇది ఈయనగారి పాత అలవాటే అంటూ మరికొంత మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.అలాగే, కౌన్సిలింగ్‌లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ పరిశీలన సమయంలో చిన్న చిన్న లోపాలను చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుల ధృవపత్రాలు, విద్యార్హతల వివరాల్లో చిన్న తేడాలను పెద్ద సమస్యలుగా చూపించి ఒత్తిడి తీసుకొస్తున్నారని పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.


**పాత ఆరోపణల చిట్టా వెలుగులోకి**

ఈ అధికారిపై గతంలో నమోదైన ఆరోపణల వివరాలను మీడియాకు అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే పూర్తి ఆధారాలతో ఈ వ్యవహారాన్ని బయటపెట్టి, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ మరియు ఏసీబీ దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు.నిరుద్యోగుల తరఫున ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వీ మాట్లాడుతూ, "నియామకాల్లో పారదర్శకత ఉండాలి. ఎవరు ఎంత పెద్ద అధికారులైనా సరే, అవినీతి ఆరోపణలు ఉంటే పూర్తి స్థాయి విచారణ జరగాలి. అర్హులైన అభ్యర్థులను భయపెట్టి డబ్బులు వసూలు చేసే పరిస్థితి ఉంటే అది తీవ్రమైన విషయం గా పరిగణించాలని " అని అన్నారు.అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని , కౌన్సిలింగ్ ప్రక్రియపై ఆఫీసు సూపరిండెంట్ పై నిషేధం విధించి సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో ఆధారాలతో మరొక కథనంతో సూర్య వాస్తవం పాఠకుల ముందుకు తీసుకొస్తుంది.

# చెత్త పై డిస్కవర్ అనిల్ యుద్ధం

- నగరంలో ఎటు చూసినా చెత్త
- సింగల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం ఎప్పుడు?
- నిషేధం అమలు చేయకపోతే అధికారులను నడిరోడ్లో నిలదీస్తా
- డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్



**అనంతపురం – సూర్య వాస్తవం :** అనంతపురం మునిసిపాలిటీలో ఏమూల చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. నగరంలో చెత్త కుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోతూ ప్రజలకు నరకం చూపిస్తున్నాయని వాటివల్ల వచ్చే దుర్గంధంతో పాటు పెచ్చరిల్లుతున్న దోమలు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. ఇది ప్రజల పాలిట శాపంగా మారిందని డిస్కవర్ అనంతపురం అనిల్ కుమార్ ఎమ్మెల్యే దగ్గుపాటి కు తెలిపారు. ముఖ్యంగా నగరంలోని అశోక్ నగర్, కొవ్వూరు నగర్, లక్ష్మీ నగర్‌లో పారిశుధ్యం అటకెక్కింది. మునిసిపాలిటీ అధికారులు అసలు ప్రజల బాధలను పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఇప్పటికే డెంగీ, మలేరియా ఇతర రోగాలతో ప్రజలు సతమతమవుతున్నారని. పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని తెలిపారు. ఇంటి ముందు చెత్త తో నిండిపోయి పందులు,ఆవులు నిండిపోయాయన్నరు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చర్యలు మాత్రం శూన్యం అన్నారు. ఒకవేళ ఫిర్యాదు తీసుకున్న ఆఫ్ ఫిర్యాదును మూసి వేయడంలో వీళ్ళు సిద్ధహస్తులని ఎద్దేవా చేశారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దయనీయమైన పరిస్థితుల ప్రజలు ఉన్నారన్నారు. పారిశుధ్యం సరిగ్గా లేక విష జ్వరాలు ప్రబలుతున్నాయని పసిపిల్లలు ప్రజలు, వృద్ధులు చనిపోతే కానీ వారికి చలనం రాదన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో మున్సిపాలిటీ ఆఫీస్ ఎదురుగా భారీ ఎత్తున ఉద్యమం చేపడతనని ఎమ్మెల్యేకు తెలియజేశారు. అదేవిధంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం పై చర్యలు మాత్రం తీసుకోవడం లేదని... కేవలం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేస్తే ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. కొంతమంది వ్యాపారులకు లాభం చేకూరేలా జనాల ప్రాణాన్ని పణంగా పెడుతున్నారని ప్లాస్టిక్ అమలు చేయకుంటే న్యాయపోరాటం చేస్తామని.... ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ నిషేధం చేయకపోతే నడిరోడ్లో నిలదీస్తానన్నారు






# నూతన వధూవరులను ఆశీర్వదించిన నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి



**వెంకటగిరి– సూర్య వాస్తవం:** వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం మన్నూరుమిట్ట గ్రామ పంచాయతీకి చెందిన వైయస్సార్ సిపి నాయకులు జడపల్లి రవిగౌడ్,శ్రీమతి పెంచలమ్మ కుమారుడు పృథ్వి గౌడ్ వధువు లక్ష్మీ ప్రియా ల కళ్యాణం రిసెప్షన్ సందర్భంగా నూతన వధూవరులను వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకురాలు కల్పలత రెడ్డి బాలాయపల్లి మండలం మన్నూరు మిట్ట గ్రామంలోని నివాసానికి వెళ్లి నూతన దంపతులైన జడపల్లి.పృథ్వి గౌడ్, లక్ష్మీ ప్రియ లను ఆశీర్వదించినారు. నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తనకు ఎన్ని పనులు ఉన్న తమ పార్టీ కార్యకర్తలు, నాయకుల కార్యక్రమాలకు హాజరవ్వడం ఒక ఆనవాయితీగా ఉంది. పేద గొప్ప అనే తారతమ్యం లేకుండా వైసీపీ శ్రేణుల ప్రతి కుటుంబ కార్యక్రమంలో ఆత్మీయుడుగా, బంధువుగా రామ్ కుమార్ రెడ్డి హాజరవ్వడంతో ఆ కుటుంబాలు, పార్టీ శ్రేణులలో ఆనందాలకు అవధులు లేకుండా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వారివెంట నియోజకవర్గ నాయకులు బాలాయపల్లి మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## శ్రీ షిరిడి సాయిబాబా కల్యాణ మండపం ప్రారంభం



**కణేకల్ - సూర్య వాస్తవం :** కణేకల్-కొత్తపల్లి రోడ్డులో ఉన్న శ్రీ సాయి బాబా దేవాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడి సాయిబాబా కల్యాణ మండపం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు రాజకీయ నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు.మండల అధ్యక్షుడు వన్నారెడ్డి ఉదయం 10:41 గంటలకు సుముహూర్తంలో రిబ్బన్ కట్ చేసి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన వన్నారెడ్డి దేవాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు ఈ కల్యాణ మండపం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ లాలెప్ప, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఆనందరాజులు, మాజీ మేజర్ పంచాయతీ సర్పంచ్ పక్రుద్దీన్, కలేకుర్తి సుదర్శన్, గరికపాటి బసవరాజు, బాయినేని ఆది, గనిగేర గోపాల్ రెడ్డి, కణేకల్ బీ.టి. రమేష్ తదితరులు పాల్గొన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నేడు విద్యుత్తు అంతరాయం

**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి టౌన్‌లో రోడ్డు విస్తరణ కారణంగా కరెంటు వారు కరెంటు లైన్లు పోలు మారుస్తున్నారు. మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు ఈ ఏరియాలలో కరెంటు ఉండద నీ కడప రోడ్డు, పోలీస్ స్టేషన్, గవర్నమెంట్ హాస్పిటల్, బ్యాంకు సర్కిల్, హైస్కూల్, వివేకానంద డిగ్రీ కాలేజ్, నూర్జహాన్ ఆల్, కాపు వీధి,గాండ్ల వీధి,పాతపేట ఓల్డ్ మార్కెట్, అమ్మవారి శాల, బొడ్డు చావిడి, బిడాలమిట్ట, చైతన్య స్కూల్,టిటిడి కళ్యాణ మండపం ఏరియాలలో కరెంటు ఉండదని ఏ ఈ జి. సుబ్బరాయుడు ముందస్తు సమాచారం తెలియజేశారు.

## అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

### -ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి

**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకా లమ్మ తల్లికి ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృ తాభిషేకం, సహస్రనా మార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో



భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు ఎండోమెంట్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మఠాధిపతి పట్టాభిషేక ఏర్పాట్లను పరిశీలించిన సీఐ

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** ఈనెల 26న జరగబోయే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి పట్టాభిషేక మహోత్సవాలను ఏర్పాట్లను పరిశీలించిన మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్ ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ప్రాంగణంలో ఈ పట్టాభిషేకం మహోత్సవాలు 24,25,26 మూడురోజులు పాటు కన్నుల పండుగ జరగనున్న సందర్భంగా సంప్రదాయ వ్యవహారాలకు భంగం కలగకుండా, భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖ చేయవలసిన ఏర్పాట్లు కోసం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి , మఠాధిపతి తమ్ముడు శ్రీ దత్తాత్రేయ స్వామి, మఠాధిపతి బామ్మర్ది పిపియన్ ప్రసాద్ తో మాట్లాడి వారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శివప్రసాద్, పోలీసులు ఓబులయ్య, రాజేష్ తదితరులు ఉన్నారు.



### తొలి స్వాతంత్ర్య సమరయోధుడు

## ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** రేనాటి వీరుడు స్వర్గీయ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి భారతదేశంలోనే ఆంగ్లేయుల మీద పోరాటం ప్రారంభించిన తొలి స్వాతంత్ర సమరయోధుడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం కడప జిల్లా వేంపల్లి లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ క్రీస్తుశకం 1857లో ప్రధమ భారత



స్వాతంత్ర సంగ్రామం జరగగా అంతకు పది సంవత్సరాల ముందే 1847లోనే నరసింహారెడ్డి ఆంగ్లేయుల దుష్ట పాలనపై తిరుగుబాటు చేసి వీరమరణం పొందాడన్నారు. క్రీస్తు శకం 1847 ఫిబ్రవరి 22వ తేదీన కోయిలకుంట్ల వద్ద జుర్రేటి వాగు ఒడ్డున రెండు వేల మంది ప్రజల సమక్షంలో నరసిం హారెడ్డిని ఆంగ్లేయులు ఉరితీసి ఆయన తలను కోయల కుంట్ల కోటగుమ్మానికి 30 ఏళ్ల పాటు వేలాడదీశారు. ఈ సంఘటన బట్టి నరసింహారెడ్డి ఆంగ్లే యులకు సింహ స్వప్నంగా ఉండేవాడని స్పష్టమవుతోందని తులసి రెడ్డి అన్నారు. ఆయన పోరాట పటిమ, వీరత్వం, పౌరుషం ప్రతి తెలుగు వాడికి,ప్రతి భారతీయునికి ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకం,స్ఫూర్తిదాయకం అని తులసి రెడ్డి కొనియాడారు.

నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ పార్టీ వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బండారు వెంకటేశు, బద్రీనాథ్, వినయ్, రవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి తోట పనిముట్లు అందజేత

### - ఇండిపెండెంట్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్ఎస్ఎస్



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందులలో పురాతనమైన శ్రీ రంగనాథ స్వామి వారి ఆలయానికి డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్, ఇండి ఎండెంట్ సైంటిస్ట్ డాక్టర్ రామిశెట్టి శివశంకర్, సరస్వతీ దంపతులు దాదాపు 15 వేల రూపాయల విలు వగల తోట పనిముట్లను ఆదివారం ఆలయానికి అందజేశారు. శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన ఒక కార్యక్రమంలో వీటిని ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, ఈవో కె.వి.రమణలకు ఆయన అందజేశారు. గతంలో కూడా ఆయన ఆల యానికి సంబంధించి పరిశుభ్రత కార్య క్రమాల్లో దాదాపుగా అవసరమైన పురుగుమందులను పరిశుభ్రం చేసేందుకు అవసరమైన నిధులను సమకూర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్ఎస్ దంపతులకు ఆలయ చైర్మన్ ,ఈవోలు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. ఈ సందర్భంగా ఇండిపెండెంట్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్ఎస్ఎస్ మాట్లాడుతూ పులివెందులలో అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి తాను ఒక భక్తుడిగా, సభ్యుడిగా నిరంతరం అభివృద్ధికి సహకరిస్తూ ఉంటామని పేర్కొన్నారు. ఈ



ఆలయ సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో శ్రీ రంగనాథ స్వామి ఆలయం శాశ్వత ఉభయదారుల ప్రతినిధులు, గుప్తా మెడికల్ స్టోర్ యజమాని మేడం దినేష్ కుమార్, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్, ట్రస్ట్ సభ్యులు ఆలమూరు రమేష్, శ్రీ సాయి చైతన్య గ్రూప్ ఆఫ్ కాలేజెస్ కరస్పాండెంట్ అరవీటి నారాయణరెడ్డి, ఆలయ సిబ్బంది ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణరాజ్ శర్మ, పురుషోత్తం, డాక్టర్ ఆర్ఎస్ఎస్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రణీత రాయలు, నిఖిల్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రహ 'దారిద్ర్యం'

### - గుంతలమయంగా రోడ్లు
### - ప్రాణాల మీదకు వస్తున్న ప్రయాణం

**కణేకల్లు - సూర్య వాస్తవం:** మాల్యం గ్రామం నుంచి సొల్లాపురం వైపు వెళ్లే సింగిల్ లైన్ ఆర్ ఎండ్ బి రహదారి ప్రస్తుతం గుంతల మయంగా మారి వాహనదారులకు కంటికిమీద కునుకు లేకుండా చేస్తోంది. గత కొన్ని నెలలుగా సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రమాదాలకు వేదికగా మారింది. రోజురోజుకూ కుంగిపోతున్న రహదారి పరిస్థితి స్థానిక ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రహదారి ఇరువైపులా పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో పాటు పక్కభాగాలు కూలిపోవడంతో వాహనాలు ఒకదానికొకటి దారి ఇచ్చుకోవడం సాహసంగా మారింది. దీంతో డ్రైవర్లు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోంది.ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, పంట లోడ్లు తరలించే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో రైతులు తమ పంట ఉత్పత్తులను సమీప మార్కెట్లకు తీసుకెళ్లేందుకు ఈ రహ దారిపైనే ఆధారపడుతున్నారు. అయితే రహదారి దుస్థితి కారణంగా తరలింపులో ఆలస్యం అవుతుండటమే కాకుండా, వాహనాల మరమ్మతులకు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. విద్యార్థుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. సమీప పట్టణాలకు విద్యనభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులు ప్రతిరోజూ ప్రాణాల మీదకు తెచ్చు కుని ప్రయాణించాల్సి వస్తోంది. పలుమార్లు ద్విచక్ర వాహనాలు జారి పడిన ఘటనలు చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.



అదృష్టవశాత్తూ పెద్దప్రమాదాలుతప్పించుకున్నప్పటికీ, ఎప్పుడైనా విషాదం సంభవించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత భయానకంగా మారుతోంది. రహదారిపై వీధి దీపాలు లేకపోవడం, గుంతలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాద భయం పెరుగుతోంది. అత్యవసర వైద్య సేవల కోసం రోగులను తరలించే సందర్భాల్లో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు తెలిపారు.స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా వెంటనే గుంతలను పూడ్చి, రహదారి పక్కభాగాలను బలోపేతం చేసి, అవసరమైతే రహదారిని విస్తరించి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఇకనైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ప్రజల నిత్యజీవితానికి కీలకమైన ఈ రహదారిని అత్యవసరంగా పునరుద్ధరించడం అత్యవసరమని ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు ఒకే స్వరంతో కోరుతున్నారు.

# తొలి విప్లవకారుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి

- ఘనంగాఉయ్యాలవాడ నరసింహారెడ్డి 179వవర్ధంతి వేడుకలు
- అఖిల భారత రెడ్డి సంఘం అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి
- రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి



**ప్రొద్దుటూరు - సూర్యవాస్తవం:** స్వాతంత్ర సమరయోధులు తెలుగు తొలి విప్లవకారుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారిని ఎదిరించి, వారికి ముచ్చె మటలు పట్టించిన మహా గొప్ప వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచాల సుధాకర్ రెడ్డి లు పేర్కొన్నారు. ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలోని వివేకానంద క్లాత్ మార్కెట్ ఎదురుగా ఉన్న స్వాతంత్ర సమ రయోధులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహమునకు పూలమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి,సుధాకర్ రెడ్డిలు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ఎదిరించి వారికి మూడు చెరువుల నీళ్లు తాగించిన, స్వాతంత్ర సమరయోధులు, తెలుగుతొలి విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అన్నారు. తొలి స్వాతంత్ర ఉద్యమానికి 100 సంవత్సరాల ముందే దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారిని ఎదిరించి, వారికి ముచ్చెమటలు పట్టించిన వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అన్నారు. ఈయన 1806 సంవత్సరం నవంబర్ 24వ తేదీన అప్పటి కడప జిల్లా కోయిలకుంట్లలో పెద్ద మల్లారెడ్డి దంపతులకు జన్మించారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీన జిల్లేటి వద్ద బహిరంగంగా నరసింహారెడ్డిని ఉరి తీసింది బ్రిటీష్ ప్రభుత్వం అని వారు ఆవేదన వ్యక్తంచేశారు. స్వాతంత్రం కోసం పోరాడే విప్లవకారులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా 1877 వరకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తలని కోయిలకుంట్ల కోటలో ఊరి కొయ్యకు వేలాడదీశారని వారు గుర్తుచేశారు. అలాంటి గొప్ప విప్లవకారుని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు మీద పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసిందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి వర్ధంతిని నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రెడ్డి సంఘం నాయకులు కోటా ఓబులరెడ్డి ( విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు ) ఏరువా సుబ్బరామిరెడ్డి, కుప్పన్నగారి నాగేంద్ర రెడ్డి, కోటా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

## - భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన పూజలు





**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** సింహాద్రిపురంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభ మయ్యాయి. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో మారుమోగింది.

**విశేష పూజా కార్యక్రమాలు**

వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రాతఃకాల పూజలు,పంచామృత అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కంకణదారులు, 8 మంది దంపతుల సమక్షంలో స్వామి వారి కళ్యాణ తంతును వేద మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా జరిపించారు.

**భక్తుల తాకిడి - అన్నదానం**

ఈ వేడుకను వీక్షించేందుకు నియోజకవర్గ నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు.

అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన భక్తులకు, గ్రామస్తులకు, స్వచ్ఛంద సేవకులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పేదల కోసం పరితపించే ప్రజా ప్రభుత్వం

## - సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పులివెందుల - సూర్య వాస్తవం:** పేదల కష్టాల్లో తోడుగా నిలవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతూ సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు, శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి స్వయంగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం శాసనమండలి సభ్యుల స్వగృహంలో నిర్వహించబడింది. మొత్తం 52 మంది లబ్ధిదారులకు రూ. 50,92,183 విలువైన చెక్కులు అందజేయడం జరిగింది. వైద్య చికిత్సలు, ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం జీవ నాధారంగా మారుతోంది. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉంది. ముఖ్యంగా పేదల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేదు. సీఎం సహాయనిధి ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి వెంటనే సహాయం అందించడమే మా లక్ష్యం. లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు."



# ఐదు రోజులుగా నీటి కష్టాలు

## - పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం





**వేముల - సూర్య వాస్తవం:** వేమల మండల కేంద్రంలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం తో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ కాలనీ, పాత మసీదు కాలనీ, అమ్మవారి శాల బజార్ ప్రాంతాల్లో గత ఐదు రోజులుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ బాధ్యులైన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా మోటర్ కాలిపోయింది చేస్తాం చూస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారే గానీ సమస్య పరిష్కారానికి ఎటువంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతు న్నారు. నాలుగు రోజులుగా తాగునీరు అందక కుటుంబాలు బిందెలతో తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. రంజాన్ మాసం జరుగుతున్న ఈ సమయంలో ఇందిరమ్మ కాలనీ, పాత మసీదు కాలనీలలో అధికంగా నివసిస్తున్న ముస్లిం కుటుంబాలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉపవాస దినాలలో తాగునీరు అందక తీవ్ర అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం స్పందించకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. గ్రామ స్థాయిలో సమస్యను పరిష్కరించాల్సిన పంచాయతీ అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిపై జిల్లా స్థాయి అధికారులు తక్షణం దృష్టి సారించి బాధ్యులపై చర్యలు తీసుకుని, నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా జిల్లా యంత్రాంగం స్పందించి వేముల ప్రజల దాహార్తిని తీర్చేలా చర్యలు తీసుకుంటుందా అన్నది చూడాల్సి ఉంది.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న కాపు రామచంద్ర రెడ్డి దంపతులు





**రాయదుర్గం - సూర్య వాస్తవం:** ఓబులాపురం సర్పంచ్ మల్లికార్జున సహోదరుడు బోయ గౌసిద్ధ కుమార్తె శాంతి, బోయ తరుణ్ కుమార్ వివాహ వేడుకల్లో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు కాపు రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకల్లో కాపు రామచంద్రారెడ్డి దంపతులు ప్రజలతో మమేకమై విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాపు రామచంద్ర రెడ్డి ప్రియ శిష్యులు.. బోయ వన్నూరు స్వామి, రాళ్ల తిమ్మారెడ్డి, బోయ మల్లి కార్జున, వెంకట్ రెడ్డి, సురేష్ నాగరాజు, మంజు, కాసిం పీరా తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం

## - స్థానికంగానే శనగల కొనుగోలు
## - మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్




**పులివెందుల - సూర్య వాస్తవం:** రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్ తెలిపారు. ఆదివారం మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శెనగ రైతులకు మద్దతు ధర కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తమవుతోందని, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి రామసురా రెడ్డి,మరియు పులివెందుల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చంద్రవర్ధన్ రెడ్డి సంయుక్తంగా శెనగ కొనుగోలు వివరాలను వెల్లడించారు.

**బీటెక్ రవి కృషితో పరిష్కారం**

మార్కెట్‌లో శెనగ ధరలు తగ్గడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి అచ్చెన్నాయుడులతో మాట్లాడి, శెనగలకు రూ. 5,875 మద్దతు ధర ప్రకటించేలా చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని నేతలు తెలిపారు. రైతులకు రవాణా భారం తప్పించేందుకు నేటి నుంచే పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి అని తెలిపారు. ఈ-క్రాప్ లో పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు ఈ మద్దతు ధర సదుపాయాన్ని వినియోగించుకోవచ్చును అని పంట విక్రయించిన 15 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయబడుతుందని, రైతులు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా,ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు కోరారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని వారు స్పష్టం చేశారు.

# కోట లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం

## - స్వామి మాల ధరించిన భక్తుల ఇడిముడి కార్యక్రమం



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో గుత్తి కోటలో వెలసిన శ్రీ భూనిల సమేత గుత్తి కోట లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం, గుత్తి పరిసర ప్రాంతాలలో నూరుకు పైగా భక్తులు స్వామివారి మాలలు ధరించి ఈరోజు 42 రోజులు తర్వాత ఇరుముడి కార్యక్రమం. ఈ కార్య క్రమానికి గుర్తు పట్టణ నలు మూలల ప్రాంతాల నుంచి భక్తులు రావడం జరుగుతుంది. ఉదయం 9 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుంది అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు అన్నదాన కార్యక్రమం జరుగుతుంది తర్వాత ఐదు గంటల నుండి స్వామివారు గరుడ సేవా కార్యక్రమం గుత్తి కోట నుండి గుత్తి వీధుల గుండా స్వామి వారు దర్శనం ఇస్తారని గుత్తి కోట లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ తెలియజేశారు.

# యువతకు స్ఫూర్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం

- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన రావు
- బ్రిటిష్ వ్యతిరేక తొలి సాయుధ పోరాట యోధుడికి నివాళులు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** నేటి యువతకు స్ఫూర్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం మని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన రావు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం మదనపల్లి కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ హాల్లో యువజన సర్వీసుల శాఖ మరియు జిల్లా పర్యాటక శాఖ వారి సంయుక్త అధ్వర్యంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారి వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ముఖ్య అతిథిగా మధుసూదన రావు పాల్గొని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారి జ్యోతి ప్రజ్వలన చేసి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి మాట్లాడుతూ.... 1846 సంవత్సరంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా కర్నూలు ప్రాంతంలో సాయుధ పోరాటం ప్రారంభించి స్వాతంత్ర్య సంగ్రామానికి నాంది పలికిన తొలి వీరులలో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఒకరని తెలిపారు. దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి భావం నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు పోరాడిన మహ నీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, యువత దేశాభివృద్ధి దిశగా నిబద్ధతతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇటువంటి మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా వారి స్ఫూర్తిని విస్తరింపజేయాలని ఆయన సూచించారు. ఉయ్యలవాడ నరసింహారెడ్డి గారు 24 నవంబర్ 1806న కోయిలకుంట్ల తాలూకా రుపనగుడి గ్రామంలో జన్మించారని ఆయన అసలు పేరు మజ్జెర నరసింహారెడ్డి. ఒకప్పుడు గ్రామ పరిపాలన, భూవసూళ్లు మరియు స్థానిక భద్రత బాధ్యతలను నిర్వర్తించిన ఉయ్యాలవాడ పాలెగారు కుటుంబ వారసుడు. బ్రిటిష్ పాలన బలపడిన అనంతరం పాలెగాళ్ల వ్యవస్థను రద్దు చేయడంతో, ఆ కుటుంభం పరిపాలనా హక్కులు మరియు సామాజిక ప్రతిష్ఠను కోల్పోయింది. ఈ పరిణామాలు నరసింహారెడ్డి గారిలో వలస పాలనపై తీవ్రమైన అసంతృప్తిని కలిగించాయి. నరసింహారెడ్డి తిరుగుబాటుకు ప్రధాన కారణం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అమలు చేసిన కఠినమైన భూస్వామ్య, రెవెన్యూ విధానాలే. ఇనాం మరియు కట్టుబడి భూముల స్వాధీనం, వారసత్వ గ్రామాధికార వ్యవస్థ రద్దు, అధిక పన్నుల వసూళ్లు వంటి చర్యల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఈ విధానాలు పాలెగార్లతో పాటు రైతులు, కట్టుబడీలు, గ్రామ సేవకులు మరియు సంప్రదాయ పోలీసు వ్యవస్థపై ఆధారపడి జీవించే వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఫలితంగా గ్రామీణ సమాజంలో విస్తృత స్థాయిలో అసంతృప్తి పెరిగి బ్రిటిష్ పాలనాకు వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రారంభించాడు. ఈ తిరుగు బాటుకు సంబంధించి సుమారుగా 901 మందిపై కేసు పెట్టారు. వీరిలో 412 మంది పై నేరం రుజువు కాలేదు. 273 మందిని పూచికత్తుపై వదిలిపెట్టారు. విచారణ అనంతరం 112 మంది దోషులుగా నిర్ధారించబడ్డారు. కొందరికి ద్వీపాంతర శిక్ష పడింది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారికి మరణశిక్ష విధించబడింది. 22 ఫిబ్రవరి 1847న కోయిలకుంట్లలో ప్రజల సమక్షంలో ఆయనకు ఉరిశిక్ష అమలు చేయబడింది. ప్రజల్లో భయాన్ని సృష్టించాలనే ఉద్దేశంతో బ్రిటిష్ అధికారులు ఆయన తల, అస్థిపంజరాన్ని కోయిలకుంట్ల కోటలో పంజరంలో వేలాడదీశారు. అవి 1877 వరకు అక్కడే ఉండడం ప్రజల మనసుల్లో లోతైన మానసిక ముద్ర వేసిందని వివరిస్తూ ఆయన సేవలకు గౌరవంగా కర్నూలు ఒర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంగా నామ కరణం చేయబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యటక శాఖ అధికారి నాగ భూషణం, యువజన సర్వీసుల శాఖ మేనేజర్ సుబ్బారావు, శ్రీ కృష్ణ విద్యాసంస్థల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భావన, యువజన సర్వీసుల శాఖ అన్నమయ్య జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ నారాయణ, శ్రీ కృష్ణ విద్యాసంస్థల విద్యార్థినీలు, కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## జాతీయ స్థాయి పోటీలకు సిద్ధరాంపురం విద్యార్థి ఎంపిక



**అనంతపురం – సూర్య వాస్తవం:** బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురంలోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అభిలాష్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పల్నాడు జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ టోర్నమెంట్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ గట్టు నాగరాజు ఆదివారం తెలిపారు. బిహార్ రాష్ట్రంలో వచ్చే ఏప్రిల్ 2, 3, 4 తేదీల్లో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్ పోటీలకు అభిలాష్ వెళ్లనున్నట్లు ఆయన వెల్లడించారు. తమ పాఠశాల కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన అభిలాష్ ను పాఠశాల హెచ్ఎం నీరజ, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు నాగేంద్రప్రసాద్, కోటప్ప, బాలకృష్ణ, ఆదినారాయణ, గొప్పమ్మ, కమల, ఉమ, వెంకటలక్ష్మి, మధుబాల, లీల, సువర్ణ, షబీర్ అభినందించారు.

## తాగునీటి కటకట

- వేసవికాలం ప్రారంభ దశలోనే తాగునీటికి ఇంత ఇబ్బందులా

**పామిడి – సూర్య వాస్తవం:** స్థానిక పట్టణంలోని చివారి ప్రాంతకాలనీ అయిన వికే.ఆదినారాయణ రెడ్డి కాలనీ, వెంకమ నాయుడు కాలనీ,చైతన్య కాలనీ, నాయి బ్రాహ్మణ కాలనీలకు త్రాగునీరు సమస్యతో కాలనీల వాసులు సతమతమవుతున్నారు. ఈ సమస్యను విన్నవించుకొనుటకు సంబంధిత అధికారి అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. చరవాణి (ఫోన్) ద్వారా నైనా విన్నవిస్తామంటే స్పందించడం లేదు. ఫోన్ రిసీవ్డ్ చేసుకొనలేదు. అధికారి నిర్లక్ష్య వైఖరి పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. పామిడి పట్టణం పక్కనే పెన్నా నది కలదు.ఈ నది నుండి ఇతర జిల్లాలకు కూడా త్రాగు నీరు సరఫరా చేస్తున్నారు. కానీ స్థానిక పట్టణంలో నీటి ఎద్దడిని తీర్చలేకపోతున్నారు. ఇది సంబంధిత అధికారి నిర్లక్ష్యవైఖరికి నిదర్శనమని ప్రజలు వాపోతున్నారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి సంబంధిత పట్టణ అధికారిపై చర్యలు తీసుకొని తాగునీటి ఎద్దడిని తీర్చవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

## ముదిరాజ్ సంఘం కమిటీ సభ్యుల నియామకం



**వేంపల్లె – సూర్య వాస్తవం:** ముదిరాజ్ సంఘం కమిటీ సభ్యులను దుర్గ మల్లేశ్వర స్వామి సన్నిధి యందు ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షుడు జి. ఓబులేష్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడు జి.ఓబులేసు అధ్యక్షుడు పి.వి. చలపతి, ఉప అధ్యక్షుడు సి.నాగా ర్జున, యల్.అంజి, జి.బాల నరసింహులు. వెంకటేష్ కార్యదర్శి వై.అంజి,సహాయ కార్యదర్శి కె.రమణ కోశాధికారి, కె.వెంకట సుబ్బయ్య, సహాయ కోసాదికరీ కె.శ్రీను వర్కింగ్ ప్రెసిడెంట్ కె.మల్లేశ్ కమిటీ మెంబెర్స్‌ను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## తప్పిన పెనుప్రమాదం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** మదనపల్లె పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఆదివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. బెంగళూరు నుంచి కడప వైపు వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగి రోడ్డుపై పడగా, విద్యుత్ తీగలు చెల్లాచెదురయ్యాయి. ప్రమాద సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. లారీ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. రద్దీ ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. అప్రమత్తతతో పెద్ద ముప్పు తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

## శాసనమండలిలో వైసీపీ సభ్యుల తీరుపై

# అసహ్యించుకుంటున్న ప్రజలు

- హిందువుల మనోభావాలను వైసీపీ పూర్తిగా దెబ్బతీసింది
- చట్టసభలు అంటే జగన్మోహన్ రెడ్డికి వైసీపీకి గౌరవం లేదు....
- గాజుల ఖాదర్ బాషా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుప్పం పరిశీలకులు



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** గడిచిన వైసీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వారి అనుచర దోపిడి గ్యాంగ్ చేసిన గాయాలు రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ మరువలేరని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు... ఆదివారం నాడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి నాయకులు అసెంబ్లీ వేదికగా చంద్రబాబు నాయుడు ని అవమానించిన తీరు సర్వ సభ్య సమాజం తలదించుకునిందని మరొకపక్క లోకేష్ యువగలం పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్నారని తెలిపారు. ఒకపక్క పోలీస్ వ్యవస్థను చూస్తే పూర్తిగా నిర్వీర్యం చేశారని ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లు ఇస్తే కూడా ఇంకా వైసీపీ నాయకులకు బుద్ధి రావడం లేదని తీవ్రంగా దుయ్యబట్టారు ఇప్పటికి కూడా రాజకీయ కుట్రలు చేస్తూనే ఉన్నారని దేవుడంటే వైసీపీ నాయకులకు భక్తి లేదని భయం కూడా లేదని భయము భక్తి లేదు కాబట్టే మానవత్వం లేకుండా ప్రజలకు హింసించారని బూట్లు చెప్పులతో వెంకటేశ్వర స్వామి చిత్రపటాలు పట్టుకుని మహాపరాధం చేసి సిగ్గు లేకుండా తమ తప్పును సమర్ధించుకుంటున్నారని తెలిపారు మంత్రి పేర్ని నాని ఆయన మాట్లాడుతూ ఉంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు గా ఉన్నాయని గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజల సొమ్మును కోట్లాది రూపాయలు దోచుకొని దాచుకొని జల్సాలు చేసిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అందుకే వారికి క్రికెట్ టీమ్ 11కు కుదుర్తి ఇచ్చారన్న సంగతి పేర్ని నాని మర్చిపోయారని చెప్పారు ఒకపక్క హిందువుల మనోభావాలు పూర్తిగా దెబ్బతీశారని 35 ఏళ్లుగా హెరిటేజ్ పై ఎలాంటి మచ్చ లేదని రాజకీయ కక్షతో బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు చేసిన తప్పులు ఒప్పుకుని దేవుని క్షమాపణ అడిగితే అప్పటికైనా వైసీపీ నాయకులకు దేవుడు క్షమిస్తాడని తెలిపారు వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను ఎప్పుడు గౌరవించలేదని దుర్భాష పదజాలాలతో వైసిపి నాయకులు చట్టసభల్లో ప్రవర్తించారని చెప్పారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఐటిడిపి రాయచోటి నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు నాగ భూషణ్ రెడ్డి కసినేని మహేంద్ర నాయుడు సాంబశివారెడ్డి శేఖర్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మట్లి శ్రీనివాసులు నాయుడు, కొండారెడ్డి రోఫా తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యేలు

**గుత్తి – సూర్య వాస్తవం:**

గుత్తి పట్టణం తాడిపత్రి రోడ్ స్పంద న ఫంక్షనల్ నందు వెన్నపూస వెం కటరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ, స్టేట్ జాయింట్ సెక్రెటరీ వైసిపి ఆహ్వానం మేరకు కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, గుంతకల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పత్తికొండ మాజి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, పెద్దారెడ్డి కొడుకు హర్షవర్ధన్ రెడ్డి, గోకలనాథ్ రెడ్డి, నార్పల స త్యనారాయణ మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్, రాయలచెరువు సివి రమణా రెడ్డి పారి శ్రామికవేత్త, యాడికి ర మేష్ బాబు జెడ్పిటిసి, వెన్నుపూసల రవీంద్రారెడ్డి స్టేట్ గుత్తి వైసీపీ నాయకులు పీరా మాజీ సర్పంచ్, గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్, సుబ్బారెడ్డి, గుత్తి పట్టణం, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైభవంగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్

## - ఉత్తమ నటుడు అల్లు అర్జున్, ఉత్తమ నటి నివేదా థామస్

కొచ్చి : కొచ్చి వేదికగా 70 వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల ప్రదానోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన చాలామంది ప్రముఖులు ఈ వేడుకలో సందడి చేశారు. 'పుష్ప 2ః సినిమాకిగానూ హీరో అల్లు అర్జున్ ఉత్తమ నటుడు అవార్డు, '35: చిన్నకథ కాదు' చిత్రానికిగానూ నివేదా థామస్ ఉత్తమ నటి అవార్డులను అందుకున్నారు. ఎక్కువ అవార్డులు 'పుష్ప 2' సినిమాకి వచ్చాయి.

**2024లో విడుదలైన సినిమాలకుగానూ ... టాలీవుడ్‌కు దక్కిన మరికొన్ని అవార్డుల జాబితా వివరాలు ....**

ఉత్తమ చిత్రం : పుష్ప 2
ఉత్తమ దర్శకుడు : సుకుమార్ (పుష్ప 2)
బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్ : పుష్ప 2
ఉత్తమ సహాయ నటుడు : అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)
ఉత్తమ సహాయ నటి : అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)
ఉత్తమ పరిచయ దర్శకుడు : యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ పరిచయ నటుడు : సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ పరిచయ నటి : నయన్ సారిక (గం గం గణేశా)
ఉత్తమ సాహిత్యం : చుట్టమల్లె చుట్టేస్తోంది (దేవర), రచయిత: రామజోగయ్యశాస్త్రి
ఉత్తమ గాయకుడు : శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి: గుంటూరు కారం)
ఉత్తమ గాయని : శిల్పారావు (చుట్టమల్లె)
బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ : నితిన్ జిహానీ (కల్కి 2898 ఏడీ), రామకఅష్ణ-మోనిక (పుష్ప 2)
బెస్ట్ కొరియోగ్రఫీ : శేఖర్ మాస్టర్ (కుర్చీ మడతపెట్టి)
ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) : లక్కీ భాస్కర్
ఉత్తమ నటుడు (క్రిటిక్స్) : తేజ సజ్జా
ఉత్తమ నటి (క్రిటిక్స్) : కాజల్ అగర్వాల్ (సత్యభామ)

# "కిల్లర్" సినిమా ఆకట్టుకుంటుంది



**– టీజర్ రిలీజ్ ఈవెంట్ లో డైరెక్టర్ సుకు పూర్వాజ్**

జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్ లో నటిస్తున్న సినిమా "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్ పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మిస్తున్నారు. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు హైదరాబాద్ లో ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ ప్రొడ్యూసర్ సీతారామరావు మాట్లాడుతూ– "కిల్లర్" చిత్రం కోసం మేమంతా చాలా కష్టపడ్డాం. సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. టీజర్ లాగే సినిమాకు కూడా మీ సపోర్ట్ అందిస్తారని కోరుకుంటున్నాం. అన్నారు.

లైన్ ప్రొడ్యూసర్ దశరథ మాధవ్ మాట్లాడుతూ -- మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది. బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ తో ఆకట్టుకునేలా మూవీ ఉంటుంది. ఈ చిత్రంలో నేను బ్రదర్ రోల్ లో నటించాను. చిన్న సినిమా అయినా "కిల్లర్" పెద్ద విజయం సాధిస్తుంది. అన్నారు.

యాక్టర్ మనీష్ గిలాడ మాట్లాడుతూ -- ఈ చిత్రంలో నేను విలన్ క్యారెక్టర్ లో నటించాను. నన్ను ఒక పవర్ ఫుల్ విలన్ గా చూపించిన డైరెక్టర్ సుకు పూర్వాజ్ గారికి థ్యాంక్స్. ఈ సినిమాకు మేమంతా టీమ్ వర్క్ చేశాం. ఈ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద ఒక కొత్త హిస్టరీ క్రియేట్ చేయబోతున్నాం. అన్నారు.

యాక్టర్ గౌతమ్ చక్రధర్ మాట్లాడుతూ -– "కిల్లర్" సినిమాలో జ్యోతి పూర్వజ్ గారి యాక్షన్, ఆమె ట్రాన్స్‌ఫర్మేషన్ మీ అందరినీ ఆకట్టుకుంటుంది. నేను కూడా కొన్ని యాక్షన్ సీక్వెన్సులు పర్ ఫార్మ్ చేశాను. ఈ సినిమా టెక్నికల్ గా మంచి క్వాలిటీతో మా డైరెక్టర్ రూపొందించారు. ఇది టీజర్ మాత్రమే సినిమాతో పెద్ద సక్సెస్ అందుకుంటామనే నమ్మకం ఉంది. అన్నారు.

యాక్టర్ విశాల్ రాజ్ మాట్లాడుతూ -- మా సినిమా టీజర్ చూస్తేనే టెక్నికల్ గా మూవీ ఎంత క్వాలిటీగా ఉండబోతుందో మీ అందరికీ అర్థమై ఉంటుంది. జ్యోతి గారిని మనం సీరియల్స్ లో చూశాం. ఇప్పుడీ మూవీలో ఆమె పర్ ఫార్మ్ చేసిన విధానం సర్ ప్రైజ్ చేస్తోంది. డైరెక్టర్ పూర్వాజ్ నాకు మంచి ఫ్రెండ్. ఈ చిత్రంలో ఒక కీ రోల్ చేసే అవకాశం కల్పించారు. ఈ సినిమా మా టీమ్ అందరికీ మంచి గుర్తింపు తీసుకొస్తుందని ఆశిస్తున్నాం. అన్నారు.



# చేతులెత్తేశారు..!

- టీమిండియా ఘోర ఓటమి
- 76 పరుగులతో దక్షిణాఫ్రికా గెలుపు
- దక్షిణాఫ్రికా 187/7, భారత్ 111/10



అహ్మదాబాద్ : డిఫెండింగ్ ఛాంపియన్ చతికిల పడింది. సూపర్8 పోరులో దక్షిణాఫ్రికాకు కనీస పోటీ ఇవ్వలేదు. 188 పరుగుల ఛేదనలో భారత బ్యాటర్లు సమిష్టిగా విఫలమయ్యారు. శివం దూబె (42, 37 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) మినహా అందరూ నిరాశపరిచారు. ఇషాన్ కిషన్ (0), తిలక్ వర్మ (1), అభిషేక్ శర్మ (15) పవర్‌ప్లేలోనే నిష్క్రమించగా.. మిడిల్ ఓవర్లలో సూర్యకుమార్ యాదవ్ (18), వాషింగ్టన్ సుందర్ (11), హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0)ను కట్టడి చేసిన దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది.

18.5 ఓవర్లలో భారత్ 111 పరుగులకే కుప్పకూలింది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. డేవిడ్ మిల్లర్ (63, 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులు), డెవాల్డ్ బ్రెవిస్ (45, 29 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), ట్రిస్టన్ స్టబ్స్ (44 నాటౌట్, 24 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) మెరవటంతో 187 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. పేలవంగా పడిపోయారు : భారత్ లక్ష్యం 188 పరుగులు. గతంలో ఈ నల్లమట్టి పిచ్‌పై సఫారీలను చిత్తు చేశారు. కానీ ఎడమ చేతి బ్యాటర్లకు ఆఫ్ స్పిన్‌తో సవాల్ విసిరిన దక్షిణాఫ్రికా తొలి ఓవర్లోనే ఆతిథ్య జట్టుకు షాక్ ఇచ్చింది. ఎడెన్ మార్క్రామ్‌పై ఎదురుదాడి చేయబోయి ఇషాన్ కిషన్ (0), అనవసర షాట్‌తో తిలక్ వర్మ (1) వికెట్ కోల్పోయారు. చక్కని బౌండరీతో పరుగుల ఖాతా తెరిచిన అభిషేక్ శర్మ.. రబాడ ఓవర్లో ఓ సిక్సర్‌తో ఊపందుకున్నాడు. కానీ, నియంత్రణ లేకపోవటం, డాట్స్ బాల్స్ ఒత్తిడికి అభిషేక్ తలొగ్గాడు. యాన్సెన్ ఓవర్లో గాల్లోకి క్యాచ్ ఇవ్వగా.. బాచ్ అద్భుత రీతిలో అందుకున్నాడు. దీంతో 26/3తో భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. ఓ ఎండ్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (18) నిలిచినా.. దూకుడుగా ఆడేందుకు ఇబ్బంది పడ్డాడు. సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగటంతో ఒత్తిడిలో అనవసర షాట్లు ఆడారు.

హార్దిక్ పాండ్య (18), రింకు సింగ్ (0), అర్ష్‌దీప్ సింగ్ (1) నిరాశపరిచారు. మిడిల్ ఓవర్లలో (7-16) ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ 70 పరుగులే చేసింది. ఇక్కడే మ్యాచ్‌పై దక్షిణాఫ్రికా పట్టు బిగించింది. డెత్ ఓవర్లలోపే భారత్ ఆశలు ఆవిరి కాగా.. ఓటమి అంతరం కుదించేందుకు శివం దూబె (42) పోరాడాడు. భారత్ 18.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. సఫారీ బౌలర్లలో కేశవ్ మహరాజ్ (3/24), మార్కో యాన్సెన్ (4/22), కార్బిన్ బాచ్ (2/12) రాణించారు.

# ప్రతి కేంద్రం వద్ద నిరంతర నిఘా.....!

**- ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు**
**- జిల్లా ఎస్పీ పి. జగదీష్**




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** జిల్లాలో నేటి నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని విధాలుగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేలా తగు బందోబస్తు ఏర్పాట్లు చేయబడినట్లు ఆయన పేర్కొన్నారు.

**64 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

జిల్లాలో ఏర్పాటు చేసిన 64 పరీక్షా కేంద్రాల వద్ద సివిల్, యూనిఫాం పోలీసు సిబ్బందిని మోహరించారు. ప్రతి కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, నిరంతర నిఘా మరియు రౌండింగ్ పార్టీలు ఏర్పాటు చేయబడినవి. ముఖ్యంగా పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా కేంద్రాల పరిసర ప్రాంతాలను "సైలెంట్ జోన్"గా ప్రకటించారు.

**సెక్షన్ 144 అమలు**

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో సెక్షన్ 144 అమల్లో ఉంటుంది. నలుగురికి పైగా గుంపులుగా గుమికూడటం, అనుమానాస్పదంగా తిరగడం నిషేధించబడింది. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు....

**సోషల్ మీడియా పై పర్యవేక్షణ**

పరీక్షలకు సంబంధించిన తప్పుడు ప్రచారం, ప్రశ్నాపత్రాల లీక్ వంటి అసత్య సమాచారాన్ని సోషల్ మీడియా వేదికల ద్వారా వ్యాప్తి చేసిన వారిపై ఐటీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.

**విద్యార్థులకు సూచనలు...**

పరీక్షా కేంద్రానికి కనీసం ఒక గంట ముందుగా చేరుకోవాలి. హాల్ టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు పరీక్షా హాల్‌లోకి తీసుకురావద్దు. అందిన ప్రశ్నాపత్రం తాను రాయబోయే సబ్జెక్టుకే సంబంధించినదో లేదో పరిశీలించుకోవాలన్నరు. పరీక్షా సమయాల్లో విద్యార్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. కేంద్రాల సమీపంలో అధిక శబ్దం కలిగించే కార్యక్రమాలు, డీజేలు, ఊరేగింపులు నిర్వహించరాదని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పోలీసు శాఖకు సహకరించి పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు.

# పదవ తరగతి టాలెంట్ టెస్ట్ పోటీలలో
# జేడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రభంజనం







**వేంపల్లె – సూర్య వాస్తవం:** పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదవ తరగతి టాలెంట్ టెస్ట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలకు చెందిన వై.పూజ 77 /100 మార్కులతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే. నాగాంజనేయులు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ పోటీలలో మొదటి బహుమతి కి గాను ఆరు వేల రూపాయలు ప్రైజ్ మనీ అందుకున్నట్లు వారు తెలిపారు. పూజ ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుని కూతురని, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలరని ఏ కాంపిటీషన్ పోటీలలో అయినా కూడా పాల్గొని బహుమతులు గెలుచుకునేదని వారు తెలిపారు. నల్లపురెడ్డి పల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిచంద్ర రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కు చెందిన పూజ మంచి ప్రతిభ గల అమ్మాయిని పులివెందుల తాలూకా లెవెల్ లో మొదటి స్థానంలో రావడం అభినందనీయం హర్షణీయమని ఆ విధంగా ఆ అమ్మాయిని తీర్చిదిద్దిన ఆ హెచ్ఎంకు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పాఠశాలకు చెందిన టీచర్లు అందరూ హర్షం వ్యక్తం చేస్తూ పూజాకు అభినందనలు తెలిపారు. అలాగే ఈ పోటీలలో కన్సోలేషన్ కింద కన్సోలేషన్ కింద మరో ఇద్దరు విద్యార్థినిలు గర్విత, పావనీలు బహుమతులు అందుకున్నారు అని తెలిపారు.

# పెళ్లకూరులో రాజకీయ కలకలం...

**- టిడిపి బ్యానర్ల ధ్వంసంతో ఉద్రిక్తత**
**- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చిత్రానికి అవమానం**
**- దుండగుల అరెస్టుకు పార్టీ శ్రేణుల డిమాండ్**




**పెళ్లకూరు – సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డీపాలెం సమీపంలో చోటు చేసుకున్న బ్యానర్ల ధ్వంసం ఘటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. స్థానిక టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన శుభాకాంక్షల బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చిత్రాన్ని ఉద్దేశపూర్వకంగా కట్ చేయడం పార్టీ కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఈ చర్య వెనుక రాజకీయ కక్షలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అభిప్రాయ భేదాలు సహజమైనవే గానీ, వ్యక్తులపై లేదా పార్టీ గుర్తులపై దాడులు చేయడం తగదని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి నెలవల సుబ్రహ్మణ్యం కి , స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ కి శుభాకాంక్షలు తెలుపుతూ, స్థానిక నాయకులు సిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, దువ్వూరు రాకేష్ రెడ్డి ఏర్పాటు చేసిన బ్యానర్లే లక్ష్యంగా మారడం అనుమానాలకు తావిస్తోంది. "ఇది కేవలం బ్యానర్ ధ్వంసం కాదు, రాజకీయంగా మానసిక దాడి" అని నాయకులు పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధ్యులను త్వరితగతిన గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇటీవల మండలంలో రాజకీయ కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ సంఘటనతో పెళ్లకూరు మండలంలో రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.




# మేనకూరులో విస్తృత
# కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**- అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు ప్రత్యేక బృందాల దాడులు - వలస కూలీల వివరాల సేకరణ**



**నాయుడుపేట– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఆదివారం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. గంజాయి విక్రయం, అక్రమ చలనం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను నియంత్రించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా నాయుడుపేట డివిజన్ పరిధిలోని మేనకూరు సెజ్ ప్రాంతంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. అక్కడ నివసిస్తున్న వలస కూలీల వివరాలను సేకరించడంతో పాటు వారి గుర్తింపు పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించిన అంశాలపై తగు చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు విలేకరులతో మాట్లాడుతూ, వలస కార్మికులు చట్టాలను గౌరవిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. మద్యం సేవనం, గంజాయి వినియోగం వంటి చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. మహిళలు, పిల్లల పట్ల గౌరవప్రదమైన ప్రవర్తన కొనసాగించాలని, సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ సీఐ వెంకటేశ్వర్లు, పెళ్లకూరు ఎస్ఐ ఆదిలక్ష్మి, ఏఎస్ఐ రామ్మూర్తి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు ఇలాంటి తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# రాజకీయ చైతన్యానికి కొత్త వేదిక

**- తిరుపతిలో టిడిపి కార్యాలయానికి పునాది**
**- కార్యకర్తల ఆశయాలకు చిరస్థాయి నిలయం**
**-- భవిష్యత్ కార్యాచరణలకు కేంద్ర బిందువుగా టిడిపి కార్యాలయం**



**నాయుడుపేట – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా అవిలాలలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల నినాదాల మధ్య జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ చైతన్యానికి కొత్త దిశను చూపించింది. జిల్లా నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఎమ్మెల్సీ దీపక్ రెడ్డి, సుళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, తిరుపతి తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం నేతలు విలేకరులతో మాట్లాడుతూ , జిల్లా కేంద్రంలో పార్టీకి సొంత కార్యాలయం ఏర్పడటం కార్యకర్తలకు ఉత్సాహాన్ని నింపే పరిణామమని తెలిపారు. ఈ కార్యాలయం కేవలం భవన నిర్మాణం మాత్రమే కాదని, పార్టీ సిద్ధాంతాల ప్రచారం, ప్రజా సమస్యలపై చర్చలు, భవిష్యత్ కార్యాచరణల రూపకల్పనకు కేంద్ర బిందువుగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని, వారి ఆశయాలు నెరవేర్చే దిశగా ఈ కార్యాలయం మార్గదర్శక వేదికగా పనిచేస్తుందని నాయకులు స్పష్టం చేశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యాచరణ సమన్వయానికి ఈ కార్యాలయం కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ విస్తరణ, శ్రేణుల సమన్వయం వంటి అంశాల్లో ఈ కార్యాలయం ముఖ్యపాత్ర పోషించనుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )